క్లుప్తంగా

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



బాలికలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్

కోవెలకుంట్ల: కౌమార బాలికలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని, సూచించారు. బాలికల్లో రక్తహీనత నివారించడానికి చేపట్టిన నెల రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ప్రతి రోజు ఉదయం, రాత్రి వేళల్లో ఐరన్ మాత్రలు వేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు వీరభద్రుడు, గిరిజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: కౌలు గుర్తింపు కార్డులతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ నిరంజన్ సూచించారు. మంగళవారం మండలంలోని భీమునిపాడు రైతు భరోసా కేంద్రంలో సీసీఆర్సీపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూ యజమానుల సహకారంతో కౌలు రైతులకు 11 నెలల కాల పరిమితితో సీసీఆర్సీ కార్డులు అందజేస్తున్నామన్నారు. వీటి ద్వారా యజమాని భూ హక్కులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటపై మాత్రమే కౌలుదారునికి హక్కు ఉంటుందన్నారు. కౌలు రైతులు భూ యజమాని అనుమతితో ఆయా రైతు భరోసా కేంద్రాల్లో కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలోని 2 వార్డులోని వీధుల్లోని రహదారులపై ప్రమాదాల నివారణకు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, ప్రజల విన్నపం మేరకు అధికారులు స్పీడ్ బ్రేకర్లు చేశారు. వీధుల్లో వెళ్లేప్పుడు వాహనచోదకులు నిర్ణీత వేగం పాటించాలని, ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు సూచించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



అవార్డు గ్రహీతలతో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ : ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అన్నారు. డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మొత్తం 268 వలంటీర్లకు గానూ 240 మందికి ప్రభుత్వం ఇటీవల అవార్డులను ప్రకటించింది. సేవా మిత్ర 233 మంది, సేవా రత్న 5, సేవా వజ్రలు ఇద్దరికి అవార్డులతో పాటు రూ.10, రూ.20, రూ.30వేల చొప్పున శ్రీరాములు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పోస్టుప్రసాద్, సచివాలయాల కన్వీనర్ కురుకుంద హరి, కౌన్సిలర్ ఆర్జీ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బద్దల హరినాథ్, సతీష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

సంజామల: వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని రెడ్డిపల్లెలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చాకలి గురువిష్ణుతో నంద్యాల తెలుగుపేట మహిళ జ్యోతికి మూడు నెలల కిందట వివాహమైంది. ఇదిలా ఉండగా గత శనివారం ఊళ్లో జరిగిన ఓ మెరమని కార్యక్రమంలో పూల పాషావలి అనే వ్యక్తి జ్యోతితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె తన భర్తకు చెబుతానని హెచ్చరించడంతో నిందితుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారయత్నానికి పాల్పడగా తాను తప్పించుకుని బయటకు వచ్చింది. విషయాన్ని భర్తకు వివరించిన జ్యోతి మంగళవారం పోలీస్‌స్టేషన్‌ని ఆశ్రయించింది. ఈ మేరకు పూల పాషావలిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు. అయితే తనతో మాట్లాడని పిలిపించి తనపై జ్యోతి భర్త గురువిష్ణు దాడికి పాల్పడ్డాడని పాషావలి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు గురువిష్ణుపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

• రైల్వే స్టేషన్ కాంతులు!



ఫ్లైఓవర్ బ్రిడ్జికి లైటింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం



4,5వ ప్లాట్ ఫాంలపై లైటింగ్

డోన్ టౌన్: ఎట్టకేలకు డోన్ రైల్వే స్టేషన్ కాంతులు వెలుగుతున్నాయి. జిగేల్‌గా మెరుస్తున్నాయి. రైల్వే స్టేషన్ 4, 5వ ప్లాట్ ఫాంలపై లైటింగ్ సౌకర్యం సరిగా లేనందున ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించారు. ఈ మేరకు సోమవారం రాత్రి 4, 5వ ప్లాట్ ఫాంలతోపాటు ఫైఓవర్ బ్రిడ్జికి లైటింగ్ ఏర్పాటు చేయించారు. దీంతో స్టేషన్ వెలిగిపోతుంది. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు వసతు కల్పనపై మాట్లాడారు. డోన్ రైల్వే స్టేషన్ అమృత్ పథకానికి ఎంపికైందని, ఇంకా మౌలిక వసుతుల కల్పిస్తామన్నారు. గుంటూరు– డోన్ ప్యాసింజర్ రైలును ఐదవ ప్లాట్‌ఫాంలో ఉంచడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావించగా సానుకూలంగా స్పందించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జికి ప్రయాణికులు అలవాటుపడాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నామన్నారు. రైల్ పట్టాలు వెళ్తే ప్రమాదమని, ఫ్లైఓవర్ బ్రిడ్జిని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన ప్రయాణికులకు సూచించారు.

రూ. 2.80 కోట్లతో 60 అడుగుల వెడల్పుతో నిర్మించిన రైల్వే స్టేషన్ రోడ్డు



• రహదారులు కళకళ!

డోన్: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి ప్రత్యేక చొరువతో మోడల్ నియోజకర్గంగా డోన్ రూపుదిద్దుకుంటుంది. ప్రభుత్వం నిధులు విరివిగా మంజూరు చేస్తుండంతో నియోజకర్గంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. వందపడకల ఆసుపత్రి, పాతబస్టాండ్‌లో కూరగాయా మార్కెట్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రత్యేకించి ఏళ్ల తరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని రహదారులు కళకళలాడుతున్నాయి. పట్టణ సుందరీకరణలో భాగంగా పాత బస్టాండ్ నుంచి కిలోమీటరు మేర 60 అడుగుల వెడల్పుతో డోన్ రైల్వే స్టేషన్ వరకు రూ. 2.80 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



నాగమయ్యలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

డోన్‌టౌన్:పట్టణంలోని శ్రీతత్వమసి అయ్యప్ప స్వామి ఆలయంలో వార్షికోత్సవాన్ని(విగ్రహ ప్రతిష్ఠ దినం) పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు వినాయక సుబ్రహ్మణ్యస్వామి,మాళికపురత్తమ్మ, నవగ్రహాలు, నాగమయ్యకు పంచామృతాభిషేకాలు, అయ్యప్ప స్వామి వారికి అష్టాభిషేకంతో పాటు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర పూజల ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం 12 గంటలకు మహామంగళ హారతి, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్న అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

బనగానపల్లెరూరల్ : ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 1311 మంది, కేజీఆర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు బీముడునాయక్, రామకృష్ణ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12,00 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 12,30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీతో పరీక్షలు ముగుస్తాయని వారు తెలిపారు.

కొలిమిగుండ్ల: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండ్ శ్రీనివాసులు తెలిపారు. ఫస్టియర్ నుంచి మొదటి రోజు 56 మంది విద్యార్థులు, సెకండియర్ నుంచి 49 మంది పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకుడు నాగేశ్వర రెడ్డి వ్యవహరిస్తారన్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర వరకు జరుగుతామన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు, పోలీసులు

ప్యాపిలి: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని సోషల్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో చెట్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. అటవీ సంపదను, వన్య ప్రాణులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి నుస్రత్ ఉజొహరా, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రథసారథులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్లు రథసారథులుగా నిలిచారని రాష్ట్ర మీట్‌కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నమల్కాపురం, యర్రగుంట్ల గ్రామాల్లో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నమల్కాపురలో సేవ వజ్ర కింద ఎంపికైన తలారి మమత, సేవా రత్న కింద ఎంపికైన షేక్షావలి, యర్రగుంట్ల గ్రామంలో సేవా రత్న కింద ఎంపికైన రఘు రాముడికి శాలువ కప్పి ధ్రువీకరణ పత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, చిన్నమల్కాపురం, యర్రగుంట్ల గ్రామాల సర్పంచ్‌లు లక్ష్మీప్రసన్న, పెద్ద గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణ పరిధిలోని భానుముక్కలలోని 151,152,153 సర్వేనంబర్లలో ఉన్న మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడిన టీడీపీతో పాటు ఇతర పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సమైఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు కాలింగ్ రాముడు, సీపీఎం డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య తహసీల్దార్ శ్రీనివాసులుగౌడ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌ను కోరారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని సొంతిళ్లులేని పేదలకు ఇళ్లపట్టాలను పంపిణీ చేయాలని విన్నవించారు. గతంలోనూ భూ ఆక్రమణపై ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి స్పందన లేదని, సమస్యను ఆర్డీఓతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి తిరుణాల

బనగానపల్లెరూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేటలో గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి తిరుణాల మహోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం ఆలయంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవికి అభిషేకం తదితర పూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు బనగానపల్లె ఎస్‌ఐలు రామిరెడ్డి, వీరాంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు బుధవారం (మంగళవారం అర్ధరాత్రి) జ్యోతి ఉత్సవం ఉంటుందని, 25న గ్రామోత్సవంతో తిరుణాల ముగుస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

31లోపు ఫీజు చెల్లించాలి

డోన్ టౌన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ గంగిరెడ్డి తెలిపారు. స్థానిక కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్‌లో జరిగిన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులకు జూన్ 26నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం అవుతాయన్నారు.

నేడు ట్రాఫిక్‌పై సమావేశం

డోన్ టౌన్: పట్టణంలో భారీ వాహనాల వలన కలుగుతున్న ట్రాఫిక్ సమస్యపై బుధవారం వ్యాపారస్తులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఐ శేషయ్య మంగళవారం తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి లోడింగ్, అన్ లోడింగ్ సమయాలు నిర్దేశించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, వ్యాపారస్తులు తప్పనిసరిగా హాజరుకావాలని సీఐ సూచించారు.

భార్యాభర్తలపై కేసు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ద్వారం శ్రీనివాసరెడ్డి, అతని భార్యపై బెదరింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ద్వారం తులసమ్మకు శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి కుమారులు. ఆమెకు చెందిన 14 ఎకరాల వ్యవసాయభూమి, కళ్లందొడ్డితోపాటు ఇల్లు పెద్దకుమారుడు శ్రీనివాసరెడ్డి అధినంలో ఉంది. ఈ ఆస్తిలో సగభాగం తమ్ముడు మాధవరెడ్డికి ఇవ్వాలని తల్లి తులసమ్మ పెద్దకుమారుడిని అడిగింది. దీంతో పెద్దకుమారుడు అతని భార్య సావిత్రిలు మేము ఆస్తి ఎవరికి ఇవ్వమని, నానాదుర్భాషలాడుతూ చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తులసమ్మ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత

- విద్య, వైద్య రంగానికి పెద్దపీట
- లోకేష్‌కు మిడిమిడి జ్ఞానం.. అభివృద్ధిని ఓర్వలేక దుష్ప్రచారం
- రూ. 4.48 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని సాయినగర్, గాంధీనగర్, సుంకులమ్మవీధి, కానాల అంకిరెడ్డి కాలనీ, నాగులకట్ట వీధి ప్రాంతాల్లో రూ. 4.48 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ తదితర అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి, ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, జెడ్పీటీసీ గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

విద్య, వైద్యరంగానికి పెద్దపీట: ఎర్రబోతుల

ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందని ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. పేద కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని నాడు– నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులను ఆధునీకరించి అన్ని వసతులు కల్పించారన్నారు. ప్రజలకు చేరువలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రూ. 22 కోట్లతో బనగానపల్లె పట్టణంలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని త్వరలో సీఎం ప్రారంభిస్తారన్నారు. అలాగే కోవెలకుంట్ల పట్టణంలో రూ. 3.50 కోట్లతో 30 అసుపత్రి, రూ. 2.50 కోట్లతో అవుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆధునీకరించడంతో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, డీవీశేషిరెడ్డి, బాలమద్దిలేటి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్డీ రాధిక, పంచాయతీ రాజ్ ఏఈ ఖాన్, ఈఓ బాలాంజనేయులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎల్‌వీసీ రామసుబ్బారెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, అమడాల శంకరయ్య, వెంకటేశ్వరరెడ్డి, సంఘం సుధాకర్‌రెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, గజ్జెలరెడ్డి, రాంమోహన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

లోకేష్‌కు మిడిమిడి జ్ఞానం!

మాజీ సీఎం చంద్రబాబునాయుడు తనయుడు నారా లోకేష్‌ది మిడిమిడి జ్ఞానమని ఎమ్మెల్యే కాటసాని ఎద్దేవా చేశారు. ఇటీవల బనగానపల్లెనియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్రలో ఏదో పిచ్చిపట్టిన వ్యక్తిలా విమర్శలు చేశాడని మండిపడ్డారు. ప్రభుత్వంపై చేసే ప్రతివిమర్శ పలువురికి ఉపయోగపడేలా ఉండాలన్న ఇంకితజ్ఞానం లోకేష్‌కు లేదన్నారు. ఎవరో రాసిఇచ్చిన స్క్రిప్టును చదివి వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. గత నాలుగేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి లోకేష్‌కు, మాజీ ఎమ్మెల్యే బీసీకి కన్పించలేదా అని నిలదీశారు. గత టీడీపీ హయాంలో లోకేష్ ఐటీ మంత్రిగా పనిచేశారని, నియోజకవర్గానికి ఒక్క ఐటీ పరిశ్రమ, కనీసం ఐటీఐ కళాశాల కూడా ఏర్పాటు చేయించలేకపోయిన బీసీ జనార్దన్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. కోవెలకుంట్ల ప్రజలకు అతి త్వరలో అవుకు రిజర్వాయర్ నుంచి తాగునీటిని అందించబోతున్నామని, రాబోయే రోజుల్లో రూ. 1.30 కోట్లతో ముస్లిం మైనార్టీల కోసం షాదీఖాన, సంతపేట, స్వామినగర్, సీతారాంనగర్, తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

కౌలురైతు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: మండలంలో అర్హులైన కౌలు రైతులు కార్డుల కోసం రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని ఏఓ కిరణ్ కుమార్ మంగళవారం తెలిపారు. యజమాని పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, కౌలు రైతు ఆధార్ కార్డు అందజేయాలన్నారు. పంట నష్టం జరిగితే పరిహారం, బీమా, పంట రుణాలు పొందేందుకు కౌలు కార్డు ఉపయోగపడతాయన్నారు.

వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్యాపిలి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు రైతులు విత్తనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి షేక్షావలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ తీసుకుని వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒక్కో రైతుకు మూడు ప్యాకెట్లు మాత్రమే ఇవ్వబడునని తెలిపారు. సబ్సిడీ పోను 30 కిలోల ప్యాకెట్‌కు రూ.1674, రెండు ప్యాకెట్లకు రూ. 3,348, మూడు ప్యాకెట్లకు రూ. 5,022 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించండి

బేతంచెర్ల: ఏపీ ఓపెన్ స్కూలు ద్వార చదువుతూ పది, ఇంటర్ ఫెయిలైన అభ్యర్థులు ఈనెల 31 వ తేదీలోగా ఏపీ ఆన్‌లైన్, మీసేవా కేంద్రాలలో పరీక్షా ఫీజు చెల్లించవచ్చని భాగ్యోదయ హైస్కూల్ చైర్మన్ కానాల నాగలక్ష్మీదేవి మంగళవారం తెలిపారు. అనుత్తీర్ణులైన పది, ఇంటర్ అభ్యర్థులు అపరాధ రుసుం లేకుండా ఈనెల 25 వరకు, అపరాధ రుసుంతో రూ. 25తో 29 వరకు, అపరాధ రుసుం రూ. 50తో 31 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రీ కౌంటింగ్‌కు రూ. 200, రీ వెరిఫికేషన్ సమాధాన పత్రం జిరాక్స్ కాపీకి రూ. 1,000 ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు.

26న భూమి పూజ

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్ వరకు 53 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ 340బీ సుమారు 650 కోట్లతో నిర్మించే రహదారి నిర్మాణానికి ఈనెల 26న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. హెచ్ కొట్టాల క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించే భూమి పూజ ఏర్పాట్లను మంగళవారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ఏఈఈ ఫణిరామ్ తదితరులు పరిశీలించారు.

ఐకమత్యంగా అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీపీ పోచా రమాదేవి



మాట్లాడుతున్న ఎంపీపీ పోచా రమాదేవి

సంజామల: ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల అభివృద్ధికి ఐకమత్యంగా కృషి చేయాలని ఎంపీపీ పోచా రమాదేవి సూచించారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ నాగకుమార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఎంపీపీ ఎంపీపీ మాట్లాడుతు వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సి బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలని రామిరెడ్డి పల్లె సర్పంచ్ రామసుందర్‌రెడ్డి ఎంపీపీని కోరారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు లలిత, విమలమ్మ, మోసా, సర్పంచ్‌లు అరుణమ్మ, వెంకటయ్య, డీటీ అనిల్‌కుమార్, ఏఓ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

డోన్ టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని టికెట్ కలెక్టర్ల విశ్రాంతి భవనం వద్ద గుర్తు తెలియని వ్యక్తి(40) మృతి చెందినట్లు పట్టణ సీఐ పెనుగొండ శేషయ్య మంగళవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తి యాచకుడిగా భావిస్తున్నట్లు చెప్పారు. వడదెబ్బ, లేదా మూర్చ సంబంధిత వ్యాధితో మృతి చెంది ఉండవచ్చు అని ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. మృతుని వంటిపై టీ షర్టు, లుంగీ ఉందన్నారు. మృతిని సమాచారం తెలిస్తే పట్టణ పోలీసులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

- సీఐ పెనుగొండ శేషయ్య



కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు, పాల్పడిన ప్రోత్సహించిన ఉపేక్షించేది లేదని పట్టణ సీఐ పెనుగొండ శేషయ్య హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని చిగురమానుపేటతో పాటు పలు ప్రాంతాల్లో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నగేష్, సురేష్ మూడు బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నాలుగు కార్లు, కేజీ గంజాయి, 120 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో మల్లికార్జునగౌడ్, తలారి సుంకమ్మ, దూదేకుల సాలూబీల వద్ద నుంచి ఒక్కొక్కరి నుంచి 10లీటర్లు చొప్పున నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఎరుకల కావడి వెంకటేష్, ఎరుకల కావడి వినయ్‌కుమార్, రాజేష్ నుంచి మూడు కార్లు, 90లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నాని తెలిపారు. ఎరుకలి రవి అలియాస్ పిలక రవి నుంచి కిలో గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు ఆరుగురిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శేషయ్య తెలిపారు. మరో ముద్దాయి పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నామని తెలిపారు.